# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ప్రత్యేక పోలీస్ అధికారులను నియమిస్తూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.**

2. **విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హజ్ యాత్ర ఈ రోజు ప్రారంభమైందని హజ్ కమిటీ కార్యనిర్వాహణాధికారి అబ్దుల్ ఖదీర్ పేర్కొన్నారు.**

3. **తెలంగాణలో నికోటిన్, పొగాకుతో తయారయ్యే గుట్కా, పాన్ మసాలా తయారీ, అమ్మకాలపై నిషేధం విధిస్తున్నట్లు తెలంగాణ ఆహార భద్రత కమిషన్ తెలిపింది.**

4. **ఐపీయల్ క్రికెట్ ఫైనల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ పై విజయం సాదించి కోల్ కతా నైట్ రైడర్స్ 17వ ఐపీయల్ సీజన్ విజేతగా నిలిచింది.**

5. **నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త, కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి ఈరోజు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనున్న క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ప్రత్యేక పోలీస్ అధికారులను నియమిస్తూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 56మంది ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం తీవ్ర ఘర్షణలు జరిగిన పల్నాడు జిల్లాకు 8మంది ప్రత్యేక అధికారులను నియమించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 144 సెక్షన్ కొనసాగుతుందని, ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీసు అధికారులు తెలిపారు .

--------------------------

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి హజ్ యాత్ర ఈరోజు నుంచి ప్రారంభమైందని హజ్ కమిటీ కార్యనిర్వాహణాధికారి అబ్దుల్ ఖదీర్ తెలిపారు. ఈరోజు నుంచి బుధవారం వరకు ప్రత్యేక విమానాల్లో 692 మంది యాత్రికులు హజ్‌కి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. నిన్న గన్నవరం విమానాశ్రయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఏర్పాట్లను పరిశీలించి వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 692 మంది పవిత్ర హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు చెప్పారు. ఈ రోజు 322 మంది, రేపు 322 మంది, ఎల్లుండి 48 మంది వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. శిబిరం వద్ద తాగునీరు, విద్యుత్తు, ఇతర మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. విమానం బయలుదేరే ఆరు గంటల ముందుగా యాత్రికులు గన్నవరం విమానా శ్రయం చేరుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

---------------------------

నికోటిన్, పొగాకుతో తయారయ్యే గుట్కా, పాన్ మసాలా తయారీ, అమ్మకాలపై నిషేధం విధిస్తున్నట్లు తెలంగాణ ఆహార భద్రత కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. మే 24 నుండి ఒక సంవత్సరం పాటు ఈ నిషేధం అమల్లో ఉంటుందని తెలిపారు.

---------------------------

రైతులకు మేలు జరిగేలా ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్లో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలంగాణలో ఏ ఒక్క రైతు నష్టపోకుండా గత ప్రభుత్వం కంటే వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేశామని చెప్పారు. ధాన్యం కొన్న మూడు నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదును జమ చేశామన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో రైతు భరోసా కింద 15 వేల రూపాయల నగదు రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ఆయిల్‌పాం రైతుల అవగాహన సదస్సులో మంత్రి నిన్న పాల్గొని ప్రసంగిస్తూ, విదేశాల నుంచి పామాయిల్ దిగుమతితో లక్షల కోట్లు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కేవలం 20 శాతం మాత్రమే ఆయిల్‌పాం సాగులో ఉందని, ఇంకా 80 శాతం సాగు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యమని, వచ్చే ఐదేళ్లలో కనీసం లక్ష ఎకరాల్లో సాగయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ –ఐపీయల్‌లో భాగంగా నిన్న చెన్నై వేదికగా జరిగిన ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్‌పై విజయం సాదించి కోల్ కతా నైట్ రైడర్స్ 17వ ఐపీయల్ సీజన్ విజేతగా నిలిచింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులలు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన కోల్ కతా జట్టు 10.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 114 పరుగులని చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.కాగా ఐపీఎల్ టైటిల్ గెలవడం కోల్ కతాకు ఇది మూడోసారి. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు గతంలో 2012, 2014లోనూ ఐపీఎల్ విజేతగా నిలిచింది.

---------------------------

తెలంగాణలోని నల్గొండ– వరంగల్ ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు ఈరోజు పోలింగ్ జరుగుతుంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఈ నియోజకవర్గం పరిధిలోని వరంగల్ హన్మకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్గొండ, సిద్ధిపేట జిల్లాల్లోని 4లక్షల 63 వేల మందికి పైగా పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 12 జిల్లాల పరిదిలో 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు. మొత్తం 52 మంది అభ్యర్థులు ఉప ఎన్నిక పోటీలో ఉన్నారు. కాగా ఇటీవల లోక్ సభ ఎన్నికలు జరిగినందున ఈరోజు పోలింగ్‌లో

ఓటు హక్కు వినియోగించుకునేవారికి ఎడమ చేతి మధ్య వేలిపై సిరా గుర్తు వేయనున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ఈదురుగాలులు, అకాలవర్షాలతో గత రాత్రి పలు చోట్ల స్తంభాలు విరిగిపడటం, లైన్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అక్కడక్కడ అంతరాయం ఏర్పడిందని, మరమ్మతులు చేపడుతున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ– సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఒక ప్రకటనలో వెల్లడించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, యాదాద్రి, సంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, మేడ్చల్ జిల్లాల్లో ఈదురుగాలులతో కురిసిన వర్షాలకు భారీ వృక్షాలు, కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై, స్తంభాలపై పడ్డాయని, ప్రభావిత జిల్లాల విద్యుత్ సూపరింటెండింగ్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చామనీ తెలిపారు. నేల మీద పడిన కరెంటు తీగలు, స్తంభాల పరికరాలను తాకకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఏదైనా విద్యుత్ అత్యవసర పరిస్థితి ఏర్పడితే సమీపంలోని సిబ్బందికి లేదా డిస్కం కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని ముషారఫ్ ఫరూఖీ సూచించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన రెమాల్ తుపాను ఉత్తర దిశగా పయనించి గత అర్ధరాత్రి దాటాక బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో తీరం దాటినట్లు భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 135 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల నుంచి ఇప్పటికే బెంగాల్ ప్రభుత్వం 1.10 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. కోల్ కతా విమానాశ్రయం నుంచి సర్వీసులను అధికారులు నిలిపివేశారు. తూర్పు, ఆగ్నేయ రైల్వేలు కూడా రైలు సేవలను రద్దు చేశాయి. రెమాల్ ప్రభావంతో పశ్చిమబెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల్లో రేపటి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

---------------------------

నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త, బహు గ్రంథకర్త... కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి ఈరోజు. వితంతు పునర్వివాహం, బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషిచేసిన వీరేశలింగం పంతులు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో హితకారిణి సమాజం స్థాపించి మహిళల అభ్యున్నతికోసం ఆయన జీవితాంతం కృషి చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వేడి, ఉక్కపోత అధిక మైందని రానున్న రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈరోజు ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.అలాగే రాష్ట్రంలో ఈ రోజు 72 మండలాల్లో తీవ్ర వడ గాలులు, 200 మండలాల్లో వడగాలులు వీచే అవకాశ ముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వడగాలుల దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మరో వైపు తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది.

=====================